

సామూహిక పుట్టిన రోజు వేడుకలు జరుపుకొంటున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు

# వృద్ధాప్యాన్ని సంతోషంగా గడపాలి

- **సామూహిక వేడుకలతో సమస్యలు దూరం**
- **విశ్రాంత ఉద్యోగుల సంఘం యూనిట్ అధ్యక్షులు శ్రీనివాసరావు**

కోదాడటౌన్, అక్టోబర్ 31: ప్రేమ, అప్యాయత, అనురాగాలు కొరవడిన ఈ రోజుల్లో వృద్ధులు తమ వృద్ధాప్యాన్ని సంతోషంగా గడపాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం యూనిట్ అధ్యక్షులు శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో అక్టోబర్ నెలలో పుట్టినరోజు జరుపుకునే విశ్రాంత ఉద్యోగుల పుట్టినరోజు వేడుకలను సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను మరచిపోయి సంతోషంగా గడిపేందుకు సామూహిక పుట్టినరోజు వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం పుట్టినరోజు జరుపుకుంటున్న వారిని శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ యూనిట్ కార్యదర్శి లక్ష్మీనర్సయ్య, జిల్లా కార్యదర్శి బొల్లు రాంబాబు, చిగురుపాటి వరప్రసాద్, వెంకటేశ్వరావు, భ్రమరాంభ, పందిరి రఘువరప్రసాద్, అమృతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జయహో.. కేసీఆర్

- **జన జాతరను తలపించిన సీఎం కేసీఆర్ సభలు**
- **తొలి దఫాలో ఎనిమిది నియోజకవర్గాల్లో పూర్తి**
- **బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి అని కేసీఆర్ పిలుపు**

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్31(నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోరుతూ కేసీఆర్ పాల్గొన్న అన్ని ప్రజా ఆశీర్వాద సభలు సూపర్ సక్సెస్ అయ్యాయి. పక్షం రోజుల్లో మొత్తం ఎనిమిది నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల పక్షాన కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అన్నిచోట్లా ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి కేసీఆర్, బీఆర్ఎస్‌పై తమ అభిమానాన్ని చాటారు. గత నెల 16వ తేదీన భువనగిరి నియోజకవర్గంలో సీఎ కేసీఆర్ ప్రచారం మొదలైంది. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన తొలి ప్రచార సభ విజయవంతమైంది. భువనగిరిలో ప్రశాంతమైన వాతావరణం బీఆర్ఎస్‌తోనే సాధ్యమైందని, మరోసారి శేఖర్‌రెడ్డిని గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తనదని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. అదే స్ఫూర్తితో 26న మునుగోడులో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు జనం భారీగా తరలివచ్చారు. ఉప ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. మునుగోడు అభివృద్ధిపై తనకు ప్రత్యేక శ్రద్ధ ఉందని, ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇక 29న కోదాడలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ జరిగిన ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. విద్యావేత్త, బీసీ బిడ్డ మల్లయ్యయాదవ్‌ను గెలిపించుకొని 50-60శాతం ఉన్న బీసీలంతా తమ సత్తా చాటాలని కేసీఆర్ ఇచ్చిన పిలుపునకు అనూహ్య స్పందన లభిస్తున్నది. ఇక అదే రోజు తిరుమలగిరిలో జరిగిన తుంగతుర్తి సమరశంఖారావం సభలో ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు మద్దతుగా కేసీఆర్ మాట్లాడారు. పట్టుదల కలిగిన ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించే బాధ్యత ప్రజలు తీసుకుంటే నియోజకవర్గం మొత్తానికి దళితబంధు ఇచ్చే బాధ్యత నాది అని కేసీఆర్ ప్రకటించడం విశేషం. తర్వాత ఆలేరులో ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. 'సునీతా నా సొంత బిడ్డ. సొంత బిడ్డ కోరిన కోరికలు తీర్చే బాధ్యత తండ్రిగా నాదే. సునీతను యాదాద్రి శిఖరమంత ఎత్తు ఓట్లతో గెలిపించండి.. ఆలేరును తీర్చిదిద్దే బాధ్యత నాదే' అని స్పష్టం చేశారు. మంగళవారం సాగర్ ఆయకట్టు పరిధిలోని హుజూర్‌నగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో శానంపూడి సైదిరెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావుకు మద్దతుగా ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్ పాల్గొన్నారు. భువనగిరి నుంచి ఆసిఫ్‌నెహర్ కాల్వ ద్వారా గోదావరి జలాలను పానగల్ ఉదయ సముద్రంలోకి తీసుకొచ్చి అక్కడి నుంచి పెద్దదేవుల పల్లి రిజర్వాయర్‌లోకి తరలించే స్కీం రెడీగా ఉందని చెప్పారు. ఇది కావాలంటే బీఆర్ఎస్‌ను మరొక సారి గెలిపించాలని.. బీఆర్ఎస్‌తోనే సాగర్ ఆయకట్టులో నీళ్ల బాధకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. సాయంత్రం దేవరకొండలో ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన ప్రజాఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. ఈ సభకు సామాన్య ప్రజలతో పాటు గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేసీఆర్ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. త్వరలోనే డిండి ఎత్తిపోతలను పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు దారిద్రాన్ని పారదోలుతానని కేసీఆర్ ప్రకటించగా చప్పట్లు మార్మోగాయి. 'రవీంద్రకుమార్ మంచి ఎమ్మెల్యే... ఇదే పద్ధతిలో 70-80వేల మెజారిటీతో ఆయన్ను గెలిపించాలి' అని కేసీఆర్ పిలుపునివ్వగా చేతులెత్తి జనం సమ్మతించారు. ఇలా అన్ని సభల్లోనూ కేసీఆర్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఇక నామినేషన్ల ప్రక్రియ అనంతరం మిగిలిన సూర్యాపేట, నల్లగొండ, నకిరేకల్, నాగార్జునసాగర్ నియోజకవర్గాల సభల్లో కేసీఆర్ పాల్గొననున్నారు.

# తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష

- **బీఆర్ఎస్ సైనికులు యుద్ధానికి సిద్ధం కావాలి**
- **కాంగ్రెస్ హామీలు నీటి మూటలే**
- **మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే**
- **కర్ణాటకలో రోడ్డెక్కుతున్న రైతులు**
- **ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

కోదాడటౌన్, అక్టోబర్ 31: తెలంగాణకు సీఎం కేసీఆరే శ్రీరామరక్ష అని, బీఆర్ఎస్సే కరెక్ట్ పార్టీ అని, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ నాయకుల, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల యుద్ధానికి బీఆర్ఎస్ సైనికులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఏకమవుతున్న శత్రువుల నాటకాలకు రాబోయే 30 రోజుల పాటు నిరంతరం ప్రజాక్షేత్రంలో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గడపగడపకూ మ్యానిఫెస్టోను చేర్చే బాధ్యత బీఆర్ఎస్ శ్రేణులదేనన్నారు. కాంగ్రెస్ హామీలు నీటి మూటలే అని ఎద్దేవా చేశారు. మ్యానిఫెస్టోను నూటికి నూరు శాతం అమలు చేసిన ఘనత దేశంలో బీఆర్ఎస్ పార్టీది మాత్రమేనని తెలిపారు. మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే.. గెలిచేది బీఆర్ఎస్ పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం 14 ఏండ్లు పాటు ఉద్యమించి, కేంద్రంతో కొట్లాడి సాధించుకున్నామన్నారు. తెలంగాణను ఈ పదేండ్లలో సాగు, తాగునీరు, మౌలిక వసతులు, యువతకు ఉద్యోగావకాశాలు, ఇలా ఏ రంగంలో చూసినా అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుందని చెప్పారు. సీఎం కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని, అందుకు కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేయడం ఒక్కటే మార్గం అన్నారు. బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోను, చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరించాలని కోరారు. ఇప్పటికే రైతుబీమా తరహాలో బీమా సౌకర్యం కల్పిస్తుండగా ఇక నుంచి తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రూ. 5లక్షల బీమా అందిస్తామని ప్రకటించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు వారి పరిపాలనలో ఉన్న రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదంటూ ప్రశ్నించారు. ఇప్పటికే కర్నాటకలో విద్యుత్ సరఫరా లేక రైతులు రోడ్డెక్కుతున్నారని ఆ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన సీఎం కేసీఆర్‌ను మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ మండలాల అధ్యక్షులు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, మండల సమన్వయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి

- అన్ని వర్గాలకు అందుతున్న సంక్షేమ పథకాలు
- నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ చేసింది శూన్యం
- ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్, పక్కన ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

పెద్దవూర, అక్టోబర్ 31 : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే తెలంగాణలో అభివృద్ధి ప్రారంభమైందని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. మండలంలోని తుంగతుర్తి, రామన్నగూడెం, రామన్నగూడెంతండా, ఏనిమీది తండా, పొట్టివానితండా, నాయనవానికుంట తండా, జయరాంతండా, కొత్తతండా, పర్వేదుల, పాల్తీతండా, మర్రిపురి తండా గ్రామాల్లో మంగళవారం ప్రచారం నిర్వహించి మాట్లాడారు. పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్రం ఇంకా అభివృద్ధి కావలంటే మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. 64 సంవత్సరాలు రాష్ట్రాన్ని, దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. గతంలో అనేక పర్యాయాలు మంత్రిగా, ఎమ్మెల్యేగా పని చేసిన జానారెడ్డి నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారన్నారు. నియోజకవర్గం పూర్తిగా వెనుక బడడానికి ఆయనే కారణమన్నారు. గెలువగానే హైదరాబాద్‌కు మకాం మార్చి ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం లేకనే కొడుకును నిలబెట్టాడని విమర్శించారు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాతే నాగార్జునసాగర్ అభివృద్ధి ప్రారంభమైందని తెలిపారు. హాలియా, నందికొండను మున్సిపాలిటీగా ఏర్పాటు చేయడంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కేదే అన్నారు. రైతులకు రైతుబంధు, రైతు బీమాతో పాటు పుష్కలంగా సాగునీటిని అందించి వ్యవసాయాన్ని పండుగలా మార్చారన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రభుత్వ పథకంతో లబ్దిపొందని ఇల్లు లేదన్నారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మరింతగా పెంచనున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లుగా కేసీఆర్ భరోసా పేరుతో ప్రతి ఇంటికీ బీమా అందిస్తామని, అర్హులైన మహిళలకు రూ.400కే గ్యాస్ సిలెండర్, పేద మహిళలకు రూ.3వేల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. దాంతో పాటు రైతుబంధు, ఆసరా పింఛన్లను సైతం పెంచనుందన్నారు. అదే కాంగ్రెస్ పార్టీకి మాత్రం ఢీల్లీ పెద్దలే బాస్‌లని, వారు చెప్పినట్లు రాష్ట్ర నాయకులు చేస్తారే తప్పా ప్రజల గురించి ఆలోచించరని, ఈవిషయాన్ని ప్రజలు గుర్తుంచుకోలని కోరారు. ప్రజల బాగోగులు పట్టించుకునే బీఆర్ఎస్‌కే రాబోయే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు.

### కడుపు నింపే కేసీఆర్ కావాలా.. కడుపుకొట్టే కాంగ్రెస్ కావాలా .. : ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా పేదలు, బడుగు, బలహీన వర్గాల కడుపు నింపుతున్న బీఆర్ఎస్ పార్టీ కావాలా.. పేదల కడుపుకొట్టే కాంగ్రెస్ కావాలా అనేది ప్రజలు ఆలోచన చేయాలని ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ కోరారు. సమైక్య రాష్ట్రంలో గిరిజన తండాలను పట్టించుకున్న నాధుడే లేకుండా పోయాడని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో పాటు అధిక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతి తండా అభివృద్ధి పథంలో పయనిస్తున్నదంటే.. ఆ ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. ఏనాడు గిరిజన సమస్యలు పట్టించుకోని మాజీ మంత్రి జానారెడ్డి ఇప్పుడు ఏముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టాలని, రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.